వంతెన పూర్తయినా వెతలేనా?

- ఆర్టీసీ సర్వీసులు నడపడంలో అలసత్వం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ఇక్కుఇక్కుమంటూ ఆటోల్లో ప్రయాణాలు


సామర్లకోట–పిఠాపురం రోడ్డు


సామర్లకోట–పిఠాపురం రోడ్డులో పూర్తయిన ఏలేరు కాలువపై వంతెన

సామర్లకోట: దీర్ఘకాలిక సమస్యకు చెక్ పెడుతూ పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువపై వంతెన నిర్మాణం పూర్తి చేశారు. అయినా సామర్లకోట–పిఠాపురానికి బస్సు సర్వీసులు నిర్వహించకపోవడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు మూడేళ్ల క్రితం ఏలేరు కాలువపై ఉన్న ఇరుకు వంతెన కూలిపోవడంతో రూ.1.5 కోట్లతో వంతెన, రూ.10 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టారు. పిఠాపురం ఆర్ అండ్ బీ శాఖ ఈ వంతెన నిర్మించి, రహదారి పూర్తిచేసి నెల రోజులు గడుస్తున్నా బస్సు సర్వీసులు నడపడం లేదు. ఈ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిషేధిస్తూ రోడ్డుకు అడ్డుగా ఇనుప గడ్డర్ ఏర్పాటు చేశారు. దానిని కూడా ఆర్అండ్ బీ అధికారులు ఇటీవలే తొలగించారు.

పిఠాపురానికి నిలచిన సర్వీసులు..

వంతెన నిర్మాణంలో ఉండగా సామర్లకోట–పిఠాపురం మధ్య బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులకు ఆటోలే దిక్కయ్యాయి. ఇదే అవకాశంగా చార్జీల రూపంలో దోపిడీ జరిగింది. ఈ వంతెన, రహదారి నిర్మాణం అయ్యాక పలు కళాశాలల బస్సులు, టిప్పర్ లారీలు, ఇతర వాహనాలు తిరుగుతున్నా ప్రజా రవాణాకు అవసరమైన బస్సులను మాత్రం ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించడం లేదు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం భద్రం



ఇటీవల కాలంలో ఆటోలలో ప్రయాణిస్తున్న మహిళలు బయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆటోలో 10 నుంచి 12 మంది వరకు ఎక్కించుకుంటున్నారు. రాత్రి సమయాల్లో అపరిచిత వ్యక్తులు ఆటోల్లో ఎక్కడం వల్ల మహిళలకు భద్రత లేకుండా పోతోంది. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు ఈ రోడ్డులో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం జరుగుతోంది. వెంటనే సామర్లకోట–పిఠాపురం బస్సు సర్వీసులు ప్రారంభించాలి.

– ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

ఆర్టీసీ అధికారులతో చర్చిస్తా....



సామర్లకోట–పిఠాపురం మధ్య గతంలో ఉండే ఆర్టీసీ సర్వీసులను తిరిగి ఏర్పాటు చేసేలా అధికారులతో చర్చిస్తా. ఇప్పటి వరకు రోడ్డుకు మధ్యలో గడ్డర్ ఉండం వల్ల బస్సులు తిప్పడానికి ఆర్టీసీ అధికారులు ముందుకు రాలేదు. దానిని తొలగించడంతో బస్సుల రాక పోకలకు అవకాశం ఏర్పడింది.

– దవులూరి దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, సామర్లకోట

క్లుప్తంగా

ఉండూరులో ఢిల్లీ బృందం పర్యటన


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన బృందం సభ్యులు

సామర్లకోట: ఢిల్లీ నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం బుధవారం విస్తరణ శిక్షణ కేంద్రంలో మొక్కలను పరిశీలించారు. వర్మీ కంపోస్టు యూనిట్లు, మునగ మొక్కల పెంపకంపై ఫ్యాకల్టీలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని ఉండూరు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, యూనిట్‌లో ప్లాస్టిక్ రీ సైక్లింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సచివాలయంను సందర్శించి అందులోని సేవలను అడిగి తెలుసుకున్నారు.

పాడి రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ అన్నారు. రుణ మేళా కార్యక్రమంలో భాగంగా అమినాబాద్, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం పాడిరైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు పాలు పోసే రైతులకు ఒక్కో గేదెకు రూ.35 వేలు చొప్పున దాణా కొనుగోలు, షెడ్లు వేసుకునేందుకు జిల్లా సహకార బ్యాంకు ద్వారా రుణాలను మంజూరు చేశారన్నారు. దీని కోసం గ్రామాల్లో పాడి రైతులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించి దరఖాస్తులు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వంద మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సహకార బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం


ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్థానిక మరిడమ్మ తల్లి ఆలయంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు చిట్టెం హరి గోపాలశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు, అమ్మవారికి పుష్ప పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో టీవీ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శ్రావణ మాసం మూడో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీ దేవి వ్రతాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పూజా కార్యాక్రమానికి అవసరమైన పూజా సామాగ్రిని దేవస్థానం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పూజా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


గొల్లప్రోలు పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డానియల్

పిఠాపురం: వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్‌వీబీడీసీపీ యూనిట్ అధికారి డానియల్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన బుధవారం గొల్లప్రోలు మండలం పీహెచ్‌సీ, చేబ్రోలు పీహెచ్‌సీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎల్‌టీ రామకృష్ణ, పర్యవేక్షరులు భాషా, నారాయణరావు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలకు నిరసనగా సంతకాల సేకరణ

పెద్దాపురం: విద్యుత్ చార్జీల పెంపును తగ్గించాలని, నిత్యావసర ధరలు, పెట్రోల్, డీసెల్ ధరలు తగ్గించాలని కోరుతూ పెద్దాపురం మెయిన్‌రోడ్డులో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, బుదతా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాఖీ ఆకారంతో సీఎంకు విద్యార్థుల శుభాకాంక్షలు


రాఖీ ఆకారంలో విద్యార్థులు

పిఠాపురం: స్థానిక రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ ఆకారంలో ఏర్పడి శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ అన్నగా అండగా ఉంటున్న జగనన్నకు ఇవే తమ శుభాకాంక్షలు అంటూ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా రాఖీ పండగ

కొత్తపల్లి: అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రక్షణ్ బంధన్ పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టారు. సోదరులు ఆడపడుచులకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలతో పాటు పలు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రాఖీ పండుగతో మండలం సందడిగా మారింది. పౌర్ణమి తగులు, మిగులు రారడంతో రాఖీ పండుగను గురువారం కూడా జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు.

పట్టించుకోపోతే ఆయనెందుకు..!

- కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి
- గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో కౌన్సిలర్లు


కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇస్తున్న వైస్ చైర్మన్ నాగేశ్వరరావు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రోజురోజుకు సమస్యలు పెరిగిపోతుంటే పట్టించుకోని కమిషనర్ సత్యనారాయణపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదో వార్డు కౌన్సిలర్ మొగలి దుర్గానందరావు మాట్లాడుతూ వార్డులోని చేపల విక్రయ కేంద్రాలు, మాంసం దుకాణాలు, కోళ్ల ఫారాలు వల్ల వచ్చే దుర్వాసనతో ప్రజలను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి పైపులైనుకు దగ్గరగా ఉండడంతో నీరు కలుషితమవుతోందన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని చైర్‌పర్సన్‌కు అందజేశారు. విష్ణాలయానికి వెళ్లే ఉత్తర ద్వారం వద్ద ఉన్న టిఫిన్ సెంటర్‌ను తొలగించాలని కౌన్సిలర్లు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా కమిషనర్ పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు దళిత కౌన్సిలర్లు మాట్లాడుతూ అరుందతీపేట, ఎస్సీపేటలలో కోడి వెంట్రుకలు, చేపాలు మాంసం వ్యర్థాల తాగునీరు కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినా కమిషనర్ పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కమిషనర్‌పై శాఖాపరమైన చర్యలు కోరుతూ తీర్మానం చేశారు. నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరి సహకారం ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. అన్ని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహానికి బుధవారం ఇర్రిపాక గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్

పిఠాపురం: ప్రైమ్ 2.0 డిజిటల్ దస్తావేజు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలో బుధవారం దస్తావేజు లేఖర్లు స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్ డౌన్ నిర్వహించారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపు మేరకు ఆందోళన నిర్వహించిన లేఖర్లు తమ మనుగడను లేకుండా చేసే ప్రైమ్ 2.0 డిజిటల్ దస్తావేజు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం దస్తావేజు లేఖర్ల సంఘం నాయకులు అవసరాల రామారావు, వెలిది సూర్యప్రకాశరావు, కేవీ మల్లేశ్వరరావు, కేవీవీ భగవాన్, మూర్తి, బొజ్జా గంగాద్రి, సూరిశెట్టి జయకృష్ణ, అవసరాల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళా సృష్టి.. భళా..

స్థానిక పాదగయ క్షేత్రంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ భక్తుడు రంగు రంగుల ముగ్గులతో వేసిన దేవతారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహారాష్ట్ర నుంచి ఇక్కడకు వచ్చిన భక్తుడు వివిధ దేవతా రూపాలను అచ్చుగుద్దినట్టు వేసిన ఆయన కళా సృష్టికి ప్రతీ ఒక్కరూ ఫిదా అయిపోయారు. – పిఠాపురం





అబ్బురపరుస్తున్న రంగవల్లుల దేవతారూపాలు

వైభవంగా వేంకటేశ్వరుని పవిత్రోత్సవాలు


స్వామి వారికి పవిత్రాన్ని సమర్పిస్తున్న అర్చకులు

పిఠాపురం: గ్రామంలో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు అంకురార్పణ నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేవారు. అనంతరం పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.వెంకటయ్య, సూపరిండిండెంట్ రామచంద్రరావు, ఆలయ అధికారి ఎం.సందీప్, అర్చకులు పి.రామకృష్ణాచార్యులు, పి.నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లారీ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు

- ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి

కాకినాడ: లారీ పరిశ్రమకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం సంఘ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సుమారు 1250 మందికి దుస్తులు పంపిణీ చేశారు. రాష్ట్రంలోనే కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రేవు ఎగుమతి, దిగుమతుల్లో కీలకపాత్ర వహించే లారీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి అవసరమైతే సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక లారీ పరిశ్రమకు చెందిన ఎంతోమంది ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందగలుగుతున్నారన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి మట్టా రామకృష్ణ, కోశాధికారి పైలా రామచంద్రరావు, ఉపాధ్యక్షులు మందల వీరప్రతాప్, చిక్కాల సుధాకర్, సంయుక్త కార్యదర్శులు కొవ్వూరి సుధాకర్ రెడ్డి, వరిపల్లి శివనారాయణ, కన్వీనర్ సాగి శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలి


ఆరోగ్య హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య శ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మిలతో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆరోగ్య శ్రీ వైద్య సేవలను మరిన్ని పెంచి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చైర్మన్ తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర మార్నీడి శేఖర్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, పప్పల దుర్గారావు, ఆరెళ్లి రాఘవులు, పెంటకోట సత్తిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్

సామర్లకోట: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఫంక్షన్లు చేసుకొవడంతో ప్రజలకు అందుబాటులో ఉండేలా నవర గ్రామంలో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని హౌసింగ్ చైర్మన్ దవులూరి అన్నారు. బుధవారం గ్రామంలో నిర్మించిన జీవన జ్యోతి ఫంక్షన్ హాల్‌ను ఆయన ప్రారంబించారు. పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మండల వైస్ ఎంపీపీ వెంకట్రాయుడు, నాగన బోయిన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

కాకినాడ రూరల్: కాకినాడ మధురానగర్‌లో ఓ ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి ఆలస్యంగా వచ్చిన ఫిర్యాదు మేరకు ఇంద్రపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై దేవసుధ వివరాల ప్రకారం మధురానగర్‌కు చెందిన పోలవరపు అరుణ ఇద్దరు పిల్లలతో తన ఇంట్లో ఒక ఫ్లోర్‌లో నివాసం ఉంటూ మరో ఫ్లోర్‌ను అద్దెకు ఇచ్చారు. భర్త విదేశాల్లో ఉంటున్నారు. ఈనెల 17న ఇంట్లో ఊడుస్తుండగా ఉంగరం కనిపించడంతో బీరువాలో తనిఖీ చేయగా అందులోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. తాళాలు కూడా దగ్గరలోనే టేబుల్‌లో ఉండటంతో తెలిసినవారే ఈ పని చేసి ఉంటారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు రూ.3 లక్షల విలువైన బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వచ్చే నెల ఆరున శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

కాకినాడ కల్చరల్: స్థానిక రామారావుపేటలోని మునుసూరి సుబ్బారావు, శ్రీమతి రావమ్మ కల్యాణ మండపంలో వచ్చేనెల ఆరో తేదీన శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్కార భారతి సంస్థ కార్యదర్శి బాజిబోయిన వెంకటేష్‌నాయుడు తెలిపారు. నాలుగేళ్లలోపు బాలలకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 5 నుంచి 8 ఏళ్ల బాలలు శ్రీకృష్ణ వేషధారణతో పాటు శ్రీకృష్ణ శతక పద్యాలలో ఒకటి విధిగా పాడాలని తెలిపారు. పేర్ల నమోదుకు 98669 31117 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మార్కెట్‌కు రక్షాబంధనం

- రంగురంగుల రాఖీలతో వెలసిన దుకాణాలు
- కొనుగోళ్లలో అక్కా చెల్లెళ్లు, అన్నదమ్ములు బిజీ


అశోక్‌నగర్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

బోట్‌క్లబ్: అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాలకు సూచకంగా జరుపుకొనే రాఖీ పౌర్ణమి వచ్చేసింది. గురువారం ఉదయం 8.30 ప్రాంతంలో పౌర్ణమి తిథి వెళ్లిపోతుండడంతో కొందరు బుధవారమే సోదరులకు రాఖీలు కట్టి ఆశీస్సులు తీసుకున్నారు. కానీ సూర్యోదయానికి ఏ తిథి ఉంటే దానినే ఆ రోజు తిథిగా భావించి అధిక శాతం మంది గురువారం ఈ పండగను చేసుకుంటున్నారు. దీంతో బుధవారం స్థానిక మార్కెట్లు రాఖీ దుకాణాలతో కళకళలాడాయి. ఫ్యాన్సీ షాపులు, బుక్‌స్టాల్స్ వంటి పలు దుకాణాల వద్ద కొత్త స్టాల్స్ ఏర్పాటు చేసి రాఖీలు విక్రయించారు. ఒక్కొక్క రాఖీ రూ.10 నుంచి రూ.300 వరకూ విక్రయించారు. స్థానిక భానుగుడి సెంటర్, అశోక్‌నగర్, పెద్ద మార్కెట్, గోల్డ్ మార్కెట్ సెంటర్, గాంధీనగర్, రామారావుపేట, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో తాత్కాలిక రాఖీ విక్రయ దుకాణాలు వెలిశాయి.